51

# తోడు దొంగ

ఒకసారి అక్బర్ చక్రవర్తి యమునా నదీ తీరానికి వాహ్యాళికి వెళ్లాడు.

అక్కడ ఒక రెండు కాళ్ళులేనివాడు, కళ్ళులేని గ్రుడ్డివాడు కనిపించారు. వారిని చూసేసరికి చక్రవర్తికి జాలివేసింది.

"అంగవైకల్యంగా వున్న మీరు ఎలా బ్రతుకుతున్నారు?" అని అడిగాడు.

"ఏమి చెప్పం ప్రభూ... మేము కాయకష్టం చేసి బ్రతుకలేనివారం. ధర్మాత్ములు ఎవరయినా దయ తలచి నాలుగు డబ్బులు వేస్తే తింటాం. లేకుంటే పస్తుంటాం!" అన్నారు జాలి గొలిపేట్లుగా.

పని లేకుండా తిండి తినే వారంటే అక్బరుకు గిట్టదు.

చివరికి బాగా ఆలోచించి, "మీ కొక మామిడితోట అప్పచెప్తాను. దానికి కాపలా కాయండి. అందుకుగాను మీకు జీతం ఇస్తాను. హాయిగా బ్రతకండి" అన్నాడు.

"చిత్తం ప్రభూ..!" అని సంతోషంగా ఒప్పుకున్నారు వాళ్ళు.

అన్నమాట ప్రకారం – అక్బర్ వాళ్ళిద్దరినీ తన తోటకి కాపలాదార్లుగా నియమించాడు.

అయితే.., అప్పటివరకు తోచిన చోటల్లా తిరుగుతూ శ్రమపడకుండా ముష్టి ఎత్తుకుని నాలుగు రకాల వంటకాలు తింటూ వచ్చిన వారికి – తోటకి కాపలా కాయడం అంటే కారాగారంలో పడేసినట్టయింది.

పైగా... ఊరికే కూర్చునేసరికి రకరకాల కోరికలు కలుగసాగాయి. వాటిని తీర్చుకొనేందుకు తోటలోని మామిడి కాయలు, పళ్ళు కోసి దొంగతనంగా విచ్చలవిడిగా అమ్ముకుని జల్సా చేయడం మొదలు పెట్టారు.

కొన్నాళ్ళకి తోటలోని మామిడికాయల దొంగతనం సంగతి అక్బర్ దృష్టికి వచ్చింది.



వెంటనే కాపలాదార్లు ఇద్దరిని పిలిపించి నిలదీసి అడిగాడు. వాళ్ళు ఏమాత్ర తొణక్కుండా బెణక్కుండా సమాధానం చెప్పారు.

కుంటివాడు– "ప్రభూ! నాకు కాళ్ళు లేవు కనుక నేనైతే దొంగతనం చేయలేను కళ్ళున్నాయి కనుక జాగ్రత్తగా కాపలా కాస్తున్నాను. నాకేం తెలీదు ప్రభూ!" అన్నాడు ఏడుస్తూ

ఇక గ్రుడ్డివాడు– "మహా ప్రభూ... నేను పుట్టు గ్రుడ్డివాడిని. చెట్టేమిటి.., కాయేమిటి? చూడలేనివాడిని నేనేం దొంగతనం చేయగలను?" అంటూ లబలబలాడాడు.

వారి దీనాలాపనలు విని అక్బర్ హృదయం ద్రవించింది. వాళ్ళు చెప్పేది సబబుగానే ఉందనిపించింది. "జాగ్రత్తగా కాపలా కాసుకోండి!" అని హెచ్చరించి వదిలేశాడు.

తరువాత బీర్బల్‌తో "మరి– ఈ దొంగతనం ఎవరు చేస్తున్నట్లు?" అని అడిగాడు.

"ప్రభూ! వీళ్ళిద్దరూ అంగవైకల్యం కలవారే. కాని, తెలివి లేనివారు కారు. గ్రుడ్డివాడు కుంటివాడిని తన భుజం మీద కూర్చోబెట్టుకుని తిరుగగలడు. కుంటివాడు కావలసినచోటికి దారి చూపగలడు. ఈ విధంగా వీళ్ళే ఈ దొంగతనం చేస్తుండాలి" అని వివరించాడు.

ఆ పైన బీర్బల్ ఆరాత్రి వేగులవాళ్ళను పంపితే బీర్బల్ చెప్పినట్లు వాళ్ళిద్దరు దొంగతనం చేస్తున్నట్లు బయటపడింది.

అక్బర్ వాళ్ళని మళ్ళీ పిలిచి గట్టిగా హెచ్చరించి వదిలేశాడు.

★★★